ప్రజాశక్తి
ఆదివారం 28 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం

ఇన్‌ఛార్జి ఆర్ఐఒగా సురేష్‌కుమార్

సురేష్‌కుమార్

శ్రీకాకుళం సిటీ: ఇన్‌ఛార్జి ఆర్ఐఒగా ఆర్.సురేష్‌కుమార్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి నారాయణ్ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డివిఇఒగా వ్యవహరిస్తున్న పి.దుర్గారావు ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. దాంతో ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతులపై ఈ ఏడాది ఏప్రిల్ 22న శ్రీకాకుళం వచ్చారు. 1992లో కామర్స్ లెక్చరర్ ఉద్యోగం సంపాదించిన ఆయన తొలుత అప్పటి విజయనగరం జిల్లా చిన్నమేరంగి జూనియర్ కళాశాలలో పోస్టింగ్ అందుకున్నారు. చివరగా గుర్లలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై శ్రీకాకుళానికి వచ్చారు.



ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర తీర ప్రాంతం, అందులో ముఖ్యంగా జిల్లాలోని పలాస, కాశీబుగ్గ, ఉద్దానం కవిటి ప్రాంతం దేశానికి 'జీడిపప్పు నాడి'గా పేరుగాంచింది. ఇక్కడి గింజల రుచి, నాణ్యతకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక గుర్తింపు ఉంది. 300కి పైగా ప్రాసెసింగ్ యూనిట్లు రోజూ సుమారు 4,80,000 కిలోల గింజలను ఉత్పత్తి చేస్తూ, ప్రత్యక్షంగా, పరోక్షంగా 30,000 మందికి పైగా ఉపాధి ఇస్తున్నాయి. ఇటీవలే ఒన్ డిస్ట్రిక్ట్ - ఒన్ ప్రొడక్ట్ లో భాగంగా పలాస జీడికి జాతీయ గుర్తింపు కూడా లభించింది. అయితే ఈ పరిశ్రమను ఇప్పుడు తీవ్రంగా కుంగదీస్తున్న ముప్ప అక్రమ దిగుమతులు. పశువుల మేత, పొట్టు పేరుతో జరుగుతున్న ఈ అక్రమ దిగుమతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కార్మికులను, రైతులను, వ్యాపారులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి.

కుంగదీస్తున్న అక్రమ దిగుమతులు

● గిట్టుబాటు లభించడం లేదంటున్న రైతులు ● సెస్‌కు మినహాయింపు కోరుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి- కవిటి

ఆఫ్రికా, వియత్నాం వంటి దేశాల నుంచి జీడిపప్పు 'పశువులమేత', 'జీడిపప్పు పొట్టు' పేరుతో దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల 35 నుంచి 40 శాతం సుంకాన్ని తప్పించుకుని, దేశీయ మార్కెట్‌లో చౌక ధరలకు అమ్ముడవుతున్నాయి. గత ఐదేళ్లుగా కాకినాడ, ముంబై, చెన్నై, కృష్ణపట్నం, మిగతా ఓడరేవుల ద్వారా ఇలాంటి దిగుమతులు పెరిగాయి. సెజ్, ఇఒయు యూనిట్ల సౌకర్యాలను దుర్వినియోగం చేస్తూ, ఈ జీడి కెర్నల్ దేశీయ మార్కెట్‌లోకి మళ్లుతున్నాయి. ఫలితంగా స్థానిక ధరలు 20 నుంచి 30 శాతానికి పడిపోయాయి.

రైతులు, వ్యాపారుల వేదన

ఇటువంటి పరిస్థితుల్లో 'మా కష్టానికి తగిన గిట్టుబాటు రావడం లేదు' అని స్థానిక రైతులు వాపోతున్నారు. ప్రాసెసర్లు కూడా అదే గోడు వినిపిస్తున్నారు. 'ముడి గింజలపై ఇప్పటికే సెస్ చెల్లించినా, ప్రాసెస్ చేసిన ఉత్పత్తిపైనా ఎఎంసి అధికారులు సెస్ వేస్తున్నారు. ఇది రెట్టింపు పన్ను అవుతోంది' అని ఎపిసిఎంఎ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ సెస్ మినహాయింపు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో విధించడం వల్ల పోటీలో వెనుకబడుతున్నామని వారు చెబుతున్నారు.

దక్కని ధర!

రోజుకు 60,000 కిలోల గింజలు ప్రాసెస్ అవుతున్న ఈ యూనిట్లకు సంవత్సరానికి కనీసం 80 వేలు నుంచి లక్ష టన్నుల ముడి గింజలు అవసరం. కానీ, చౌకగా వచ్చిన దిగుమతి జీడి కెర్నల్ మార్కెట్‌ను ఆక్రమించడంతో, స్థానికంగా పండిన జీడికి తగిన ధర దక్కడం లేదు. కొద్ది నెలల క్రితం కిలోకు రూ.900 నుంచి రూ.1,000 ఉన్న జీడిపప్పు ధర, ఇప్పుడు రూ.700 నుంచి రూ.900కే పరిమితమైపోయింది.

ఎపిసిఎంఎ డిమాండ్లు

ఇలాంటి సమయంలో ఆంధ్రప్రదేశ్ జీడిపప్పు తయారీదారుల సంఘం (ఎపిసిఎంఎ) ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు పెట్టింది. అక్రమ దిగుమతులపై కఠిన నియంత్రణ. ఎఎంసి సెస్ మినహాయింపు నోటిఫైడ్ మార్కెట్ యార్డుల ద్వారా వచ్చిన గింజలపైనే సెస్ పరిమితం. 'ఇలా జరిగితేనే దేశీయ మార్కెట్ పుంజుకొని, రైతులకు గిట్టుబాటు, వ్యాపారులకు నిలకడ వస్తుంది' అని ఎపిసిఎంఎ అధ్యక్షుడు ఫణిరాఘవులు, కార్యదర్శి సుబ్బరాయలు, ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భవిష్యత్ ప్రశ్నార్థకమే?

జీడిపప్పు పరిశ్రమలో మహిళల ఉపాధి, రైతుల ఆర్థిక స్థితి, ఎగుమతుల ద్వారా రాష్ట్రానికి వచ్చే ఆదాయం అన్నీ ఈ సమస్యతో ముడిపడి ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అక్రమ దిగుమతులు కొనసాగితే ఆంధ్ర జీడిపప్పు పరిశ్రమ 'జాతీయ గుర్తింపు'కే ముప్పుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అక్రమ దిగుమతులతో పెద్దదెబ్బ

ఇతర దేశాల నుంచి పశువుల మేత పొట్టు పేరుతో జరుగుతున్న అక్రమ దిగుమతులతో జీడి వ్యాపారాలతో రైతులకు తెలియని దెబ్బ తగులుతోంది. ఇటీవల ప్రభుత్వానికి ఎపి సిఎంఎ ద్వారా సమస్యలు తెలియజేయడం జరిగింది ప్రభుత్వం కూడా మేము చెప్పిన సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటోంది. అయితే ఇప్పటికీ ఇంకా ఈ అక్రమ దిగుమతి అనేది జరుగుతోంది. దీనిపై పూర్తిస్థాయి నియంత్రణ జరిగినప్పుడు అటు జీడి రైతులకు ఇటు వ్యాపారులకు కచ్చితంగా మేలు జరుగుతుంది.

- మల్లా కాంతారావు
ఎపిసిఎంఎ ఉపాధ్యక్షుడు, పలాస

ఆమదాలవలస : జెండా ఊపి ప్రారంభిస్తున్న రామ్మోహన్ నాయుడు

జిల్లాకు పూర్తిస్థాయిలో రైల్వే సేవలు

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాకు పూర్తిస్థాయిలో రైల్వే సేవలు అందిస్తున్నామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో రైల్వేశాఖ నూతనంగా ఏర్పాటు చేసిన అమృత్ భారత్ రైలుకు స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ బ్రహ్మపురం నుంచి సూరత్‌కు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ రైలును వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. జిల్లాలో పూర్తిస్థాయి రైల్వే సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, తిరుపతి ప్రాంతాలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని పలాస రైల్వే స్టేషన్‌కు రూ.64 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వివిధ రైల్వేస్టేషన్లలో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో వందే భారత రైలుతో పాటు ఇప్పుడు అమృత భారత్ రైలు కూడా జిల్లాలో సేవలందించే విధంగా రైల్వేశాఖ మంత్రి వైష్ణవి అశ్విన్ తనకు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో పూర్తిస్థాయి రైళ్ల రాకపోకలు సాగితే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ నిరంతరం ప్రజా సేవకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, రైల్వే డిఆర్ఎం లలిత్ మొహ్రా, డిసిఎం పూజ సింగ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ రామ్మోహన్ పాల్గొన్నారు.

పలాస : పలాస రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ రైలుకు మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు, ఎఎంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రైల్వే డివిజనల్ పర్సనల్ అధికారి పి.కె.బెహరా, డివిజన్ సిగ్నల్, టెలికామ్ ఇంజినీరింగ్ అధికారి బి.కె.జెనా, అసిస్టెంట్ సెక్యూరిటీ కమాండెంట్ ఎస్.సంజయ్, డిసిఎం రమాకాంతారావు, డిఇఇ కె.శ్రీను, ఎడిఇ ఆర్కి ఖాత్రా, కూటమి నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

అమ్మో... నత్తలు

ప్రజాశక్తి- టెక్కలి

నత్త చూడ్డానికి చిన్న జీవి అయినా ఇవి వ్యాపించే విధానం ప్రజలకు అసహనాన్ని కలిగిస్తూ... ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుత భిన్న వాతావరణం నత్తల ఉత్పత్తికి అనుకూలంగా మారడంతో నత్తలు విజృంభిస్తున్నాయి. వీధుల్లో ఉన్న మొక్కలపై ఇవి వ్యాపించి వాటిని తినివేస్తుండడంతో అవి జబ్బు పట్టి నశిస్తున్నాయి. ఇంటి ఆవరణల్లో అధికంగా నత్తలు ఉండడంతో గృహాల్లో ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి ఆవరణలో పెంచుకుంటున్న మొక్కలపైనా నత్తలు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి. పలు వీధుల్లోని నివాసగృహాల సమీపాలు ఖాళీగా ఉండడంతో అక్కడ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. వాటిపైనా నత్తల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఒకరకమైన జిగురు వంటి పదార్థాలతో సంచరిస్తున్న నత్తల వల్ల మహిళలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పలు రకాలైన కొబ్బరి, బొప్పాయి పళ్ల ఆకులపై చేరడంతో రూపు రేఖలు మారిపోతున్నాయి. ఎన్నడూలేని విధంగా ఈ సీజన్‌లోనే నత్తలు అధిక కావడం, మొక్కలపై ప్రాకి వాటిని తినివేస్తుండడంతో వ్యవసాయం వైపు కూడా నత్తల ప్రభావం ఉండవచ్చునేమోనన్న ఆందోళనలో రైతులు ఉంటున్నారు. పంట చేతికి వస్తున్న క్రమంలో నత్తల బారిన వ్యవసాయం పడకుండా ఉండేందుకు రైతులు యత్నాలు చేస్తున్నారు. ఇదే విషయమై టెక్కలి మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావుని వివరణ కోరగా, ప్రస్తుత సీజన్‌లో నత్తలు అధికంగా ఉన్నాయని అన్నారు. కానీ, వ్యవసాయంపై అవి రాలేదన్నారు. ఈ విషయమై రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు లేదని తెలిపారు.

నత్తలతో దెబ్బతిన్న మొక్కలు (ఇన్‌సెట్‌లో నత్త)

వర్షపు నీరు నిల్వ ఉండరాదు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వర్షపు నీరు నగర వీధుల్లో నిలిచిపోకుండా, కాలువల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. పట్టణంలో సెవన్ రోడ్, పాత బ్రిడ్జి, ముత్యాలమ్మ మార్కెట్, సత్యానగర్ ప్రాంతాల్లో శనివారం స్వయంగా పర్యటించారు. రోడ్లు, కాలువల పరిస్థితిని సమీక్షించారు. పాత బ్రిడ్జి నుంచి ఆర్అండ్‌బి రహదారిని పరిశీలించిన కలెక్టర్ వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువలపై ఎక్కడైనా నిర్మాణాలు చేసి ఆటంకాలు కలిగిస్తే వాటిని తొలగించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల ఇరువైపులా కాలువలను పునరుద్ధరిస్తూ వర్షపు నీరు ఎటువంటి అడ్డంకులు లేకుండా నదిలోకి చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో నీటి నిల్వ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సహాయ ప్రణాళికాధికారులు వెంకటేశ్వరరావు, జానకి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజటల్ క్యూఆర్ ప్రారంభిస్తున్న సీతారాం

వైసిపి కార్యకర్తలకు అండ

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కార్యరక్తలకు మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి అండగా నిలుస్తారని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో వైసిపి ప్రారంభించిన డిజటల్ ఫిర్యాదుల పుస్తకం క్యూఆర్ కోడ్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతుందని అన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయలేక ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుందని అన్నారు. నియంతృత్వ పాలనకు ప్రజలు ముగింపు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికలు అప్రజాస్వామికంగా నిర్వహించి చరిత్ర హీనులుగా మిగిలారని అన్నారు. మెడికల్ కళాశాలలు ప్రయివేటు చేతికి అప్పగిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కూడా దొరకని పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. భవిష్యత్‌లో వైసిపి నాయకులకు హింసించిన వారికి వడ్డీతో చెల్లింపు ఉంటుందని అన్నారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. డిజటల్ బుల్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా సమస్య తెలియజేయాలని, తప్పకుండా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. టిడిపి నాయకుల దోపిడీపై క్షేత్ర స్థాయిలో వైసిపి పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, అంధవరపు సూరిబాబు, సనపల నారాయణరావు, దుంపల రామారావు, అంబటి శ్రీనివాసరావు, రౌతు శంకరరావు, బొడ్డేపల్లి పద్మజ, ఎన్ని ధనుంజయరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి

అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని మెగిలిపాడు కూడలి, కాశీబుగ్గ సంతమైదానం, ఉదయపురం, ఏకాంబరి ఆలయం వీధి, ఆంధ్రాబ్యాంకు రోడ్డు పరిసరాలను పారిశుధ్య పనుల తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలవారి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని శానిటేషన్ మెరుగుపరుచుకోవాలని సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ సరహద్దు గ్రామాలైన ఉప్పరపేట, కాశీబుగ్గ డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తీయించే పద్ధతినీ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పూడికతీత పనులను పరిశీలిస్తున్న పృథ్వీరాజ్‌కుమార్

ధరల పట్టికను ఏర్పాటు చేయాలి

జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవి

శ్రీకాకుళం సిటీ: షాపుల వద్ద జిఎస్‌టి తగ్గింపు ధరలతో ఉండే పట్టికలను ఏర్పాటు చేయాలని జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్, సూపర్ సేవింగ్స్ నోడల్ అధికారి స్వప్నదేవి వ్యాపారస్తులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యాపారస్తులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాల్డుతూ నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, మెడికల్, ఆటో మొబైల్స్, వ్యవసాయానికి సంబంధించి యంత్రాలు, ఎరువులు, ఎంఎస్‌ఎంఇలు, ప్యాకింగ్ మెటీరియల్, హెల్త్ ఇన్సూరెన్స్, తదితరమైనవి తగ్గాయని తెలిపారు. విదేశీ వస్తువులపై ఆధారపడకుండా స్వదేశీ వస్తువులను వినియోగించుకోవచ్చని వివరించారు. ప్రజలను అవగాహన పరచడానికి షాపుల వద్ద పాత ధరలు, కొత్త ధరల రేట్లు ప్రదర్శించే బ్యానర్లను డిసిప్లే చేయాలన్నారు. ధరల తగ్గింపునకు ఎవరూ బలవంతం చేయని, ధరల తగ్గింపుకు వాలంటీరుగా వ్యాపారస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి ఇంటింటికీ సచివాలయం ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాలు వెళ్లి ప్రజలకు వివరిస్తారని చెప్పారు. వ్యాపారస్తులందరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. వ్యాపారస్తులకు ఉన్న అనుమానాలను ఆమె నివృత్తి చేశారు. సమావేశంలో జిఎస్‌టి అసిస్టెంట్ అధికారి చంద్రకళ, కాశీబుగ్గ, నరసన్నపేట, ఆమదాలవలస జిఎస్‌టి అసిస్టెంట్ అధికారులు, బంగారం, రైస్‌మిల్లర్లు, హోటళ్లు, కిరాణా, ఆటో మొబైల్స్, సిమెంట్ వ్యాపారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వప్నదేవి

రచ్చకెక్కుతున్న కూటమి కుమ్ములాటలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి పార్టీల్లో అంతర్లీనంగా ఉన్న విభేదాలు ఇటీవల ఒక్కసారిగా రచ్చకెక్కుతున్నాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఇటీవల అసెంబ్లీలో లేవనెత్తిన అంశాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తనపై తప్పుడు ఆరోపణలతో కథనాలను ప్రసారం చేయిస్తూ వ్యక్తిత్వహననానికి పాల్పడేలా మరో కూటమి ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారంటూ ఆ ఎమ్మెల్యే పేరు చెప్పకుండానే పొరుగు నియోజకవర్గం అంటూ సంబోధించారు. ఆ ఎమ్మెల్యే వైసిపి నాయకులకు సహకరిస్తున్నారంటూ రాజకీయంగా ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే పేరు చెప్పకపోయినా పొరుగు నియోజకవర్గమంటే ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవికుమారేనని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ అంశం గత కొంతకాలంగా రాజుకుంటూనే ఉంది. రణస్థలం మండలంలోని సంచాం కొండ గ్రావెల్ తవ్వకాలపై ఇరువురు ఎమ్మెల్యేల నడుమ వివాదం నలుగుతోంది. ఇటీవల ఇది కాస్తా ముదిరిపాకాన పడింది. ఈ కథ వెనుక ఉన్న అసలు విషయం ప్రసారమాధ్యమాల ద్వారా బట్టబయలవ్వడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు జాగ్రత్త పడ్డారు. ఏకంగా శాసనసభలోనే ప్రస్తావించి తానే పాపమెరుగనని, అంతా కూన రవికుమార్ చేస్తున్న పనిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. సంచాం రెవెన్యూ పరిధిలో గ్రావెల్ తవ్వకాలకు గుండు కైలాస్ పేరుతో ఏడెకరాలను కూటమి ప్రభుత్వమే అనుమతులిచ్చింది. లీజుదారుడు వైసిపి పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో తనను ఎలాగూ అక్కడ పనిచేయనివ్వరనే నిర్ణయానికి వచ్చి ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. లీజుదారుడి నుంచి సబ్‌లీజ్ తీసుకుని ఎమ్మెల్యే కూన రవికుమార్ తన అనుచరులకు కట్టబెట్టినట్లు సమాచారం. ఎమ్మెల్యే కూన రవికుమార్ తీరు ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆగ్రహం తెప్పించింది. తన నియోజకవర్గంలో పొరుగు నియోజకవర్గ ఎమ్మెల్యే వేలి పెట్టడమేమిటని, ఏదైనా ఉంటే ఆమదాలవలసలో చేసుకోవాలంటూ తన అనుచరుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

లీజు వివాదం కొనసాగుతుండగానే అక్కడ పనులు జరగనీయకుండా ఎమ్మెల్యే ఈశ్వరరావు అనుచరులు అడ్డుకోవడం, ప్రొక్లెయిన్ అద్దాలు పగులగొట్టడంతో వివాదం మరింత ముదిరిపాకాన పడింది. దీంతో గ్రావెల్ తతంగం వెనుక ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రమేయంపై ప్రత్యర్థులు అసలు విషయాలను బయట పెట్టారు. గ్రావెల్ తవ్వకాలు ఇక్కడ జరపక ముందే ఇక్కడ కొండపై హైవే రోడ్ల పనుల కోసం వందలాది లోడ్లను తరలించి ఎమ్మెల్యే సొమ్ము చేసుకున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. గ్రావెల్ తవ్వకాల్లో తన పేరు బయటకు రావడంతో జీర్ణించుకోలేని ఎమ్మెల్యే ఈశ్వరరావు ఏకంగా అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను రాజకీయంగా ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేశారన్న చర్చ సాగుతోంది. ఆ మరుసటి రోజే ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఎమ్మెల్యే ఈశ్వరరావుపై తీవ్ర ఆరోపణలు సంధించారు. తన ఇల్లు, స్కూల్‌కు ఇక్కడి గ్రావెల్‌నే ఎమ్మెల్యే వాడుకున్నారంటూ చేసిన ఆరోపణలతో ఈశ్వరరావు అనుచరులు కంగుతిన్నారు. గ్రావెల్ తవ్వకాల అంశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను రాజకీయంగా ఇరికించి, తర్వాత పని చక్కబెట్టుకోవాలని చూసిన ఎమ్మెల్యే ఈశ్వరరావుకు వ్రతం చెడినా ఫలితం దక్కలేదు. తమ ఎమ్మెల్యే రాజకీయ చాతుర్యం చూసి ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో జనం సమస్యలు ఏవీ లేనట్లు గ్రావెల్ తవ్వకాలను రాజకీయం చేయడంపై నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మడ్డువలస, నారాయణపురం కాలువల నుంచి శివారు భూములకు సాగు నీరందక ఈ ఏడాదీ పంటలు ఎండిపోయాయి. భూసేకరణ పెండింగ్‌లో ఉండటంతో రణస్థలం మండలానికి తోటపల్లి ద్వారా సాగునీరు ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

ఎస్.ఎం.పురంలోని ట్రిపుల్ ఐటికి ఆరు వేల మంది విద్యార్థులకు వసతి కేటాయించగా మూడు వేల మందికే వసతి ఉంది. శివానీ, ఇంజినీరింగ్ కళాశాలలో కొన్ని గదులను అద్దెకు తీసుకుని మరో వెయ్యి మందిని అందులో ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకుండానే నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో ఇన్ని సమస్యలు ఉండగా, గ్రావెల్ తవ్వకాల విషయంలో కూటమి పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే తనను ఇబ్బంది పెడుతున్నారంటూ అసెంబ్లీలో ప్రస్తావించడం చూస్తే సొంత వ్యవహారాలు తప్ప ఎమ్మెల్యేకు ప్రజల ఇబ్బందులు పట్టవన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తోంది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రవికుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో వివిధ విద్యా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సమాన వేతనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలతో పాటు మోడల్ స్కూల్, వివిధ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు మినిమం టైంస్కేల్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వం జీతాలు అందించడం జరుగుతుందన్నారు. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు నిర్వహిస్తున్న కెజిబివి పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, మహిళా ఉద్యోగులకు మాత్రం కనీస వేతనం కూడా అందడం లేదన్నారు. గత వైసిపి పాలనలో కెజిబివి నిర్వహణతో పాటు ఉపాధ్యాయులను పట్టించుకోకుండా కేవలం రూ.5 వేలు వేతనం పెంచి అన్యాయం చేశారని ఆయన సభ దృష్టికి తీసుకు వచ్చారు. సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ సమాన పనికి సమాన వేతనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

మెడికల్ కాలేజ్‌లు ప్రైవేట్‌పరం వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మెడికల్ కాలేజ్‌లు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వద్దని, పి-4 విధానం ప్రభుత్వం విరమించుకోవాలని జిల్లా వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు అరంగి లక్ష్మి అన్నారు. న్యాయవాదులు శనివారం ర్యాలీ నిర్వహించి ప్రైవేటీకరణ విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేసిన మెడికల్ కాలేజీలను ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సరికాదన్నారు. ఈ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య చదవాలని ఆకాంక్ష, వారి కల అందని ద్రాక్షగా అవుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, సీనియర్ న్యాయవాది తంగి శివప్రసాదరావు, లీగల్ సెల్ న్యాయవాదులు పొన్నాడ ఋషి పాల్గొన్నారు.

వైద్యసేవలు అందజేస్తున్న వైద్యులు

రక్తహీనత ప్రధాన సమస్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహిళలు ఇంట్లో మంచి ఆహారపు అలవాట్లను తెలుసుకోవడం ద్వారా ఇంటిల్లిపాది మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతారని ప్రముఖ వైద్యులు, జెమ్స్ మెడికల్ కాలేజీ ఆచార్యులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు అన్నారు. తుమ్మవీధి కార్యక్రమాల కమిటీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య వేదిక సహకారంతో శనివారం మహిళల్లో రక్తహీనత చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్య ఇవ్వాలని, రక్తహీనత సమస్య అధిగ మించాలని సూచించారు. వైద్యులు డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ పైడి సతీష్ వైద్యసేవలు అందజేశారు. చౌకగా లభించే ఆకుకూరలు, పప్పు దినుసులు, గుడ్లు తినడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. పరిశుభ్రత పాటించాలని, పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 61 మందికి రక్త పరీక్షలు చేసి తగిన మందులు, వైద్య సలహాలు అందించారు. తుమ్మవీధి కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాసు, పి.రంగ, ప్రసాదరావు, పి. శాంతారావు, ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

సిఎంను కోరిన ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి: జిల్లాల విభజన తరువాత శ్రీకాకుళానికి ఐటిడిఎ కోల్పోయిందని, ఎక్కువ శాతం గిరిజనులు ఉన్న మెళియాపుట్టి మండలంలో ఐటిడిఎ ఏర్పాలు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఉండవెల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సిఎం ఎన్.రామారావు, సిఎం చంద్రబాబు హయాంలోనే ఐటిడిఎలు ఏర్పాటయ్యాయని అన్నారు. డోలి మోతలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో 14 నెలల కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నామని అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా గిరిజనులు పండించిన పంటను నేరుగా అమ్మడానికి సంతను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో గిరిజనులకు ఐటిడిఎ తోపాటు బతుకుతెరువునూ దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

డిజిటల్ బుక్ బ్రోచర్ ఆవిష్కరణ

ఇచ్ఛాపురం: అన్యాయానికి గురైన కార్యకర్తలకు, అండగా నిలవడానికి డిజిటల్ బుక్ అని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయా అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ కమ్యూనిటీ భవనంలో డిజిటల్ బుక్ బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ వైసిపి కార్యకర్తలకు అండగా నిలిచి వారికి భరోసా ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, కారింగి మోహన రావు, కంచిలి వైసిపి మండల అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు, బాబూ రావు, పిలక సంతు, ప్రకాశరావు పట్నాయక్, కాళ్ల సత్యం, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ

కవిటిపై చిన్నచూపేలా?

- గిరిజన ప్రాంత ఆస్పత్రుల్లో వైద్యుల జీతాలు పెంపు
- కిడ్నీ ప్రాంత కవిటిని జాబితాలో చేర్చని వైనం

ప్రజాశక్తి- కవిటి

గిరిజన ప్రాంతాల్లో సేవలందించే వైద్యులకు జీతాలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 40, జిల్లాలోని ఎనిమిది ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులకు ఈ జిఒ ద్వారా లబ్ధి చేకూరనుంది. అందులో భాగంగా జిల్లాలో టెక్కలి, పాతపట్నం, పలాస, బారువ, సోంపేట, బుడితి, కొత్తూరు, హరిపురం ఆస్పత్రుల్లో పనిచేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్లకు 50 శాతం, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సహాయ సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు 30 శాతం జీతాలు పెరుగుతాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రక్రియలో ఇది మంచి నిర్ణయమే. అయితే కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతమైన కవిటి మండలాన్ని ఈ జాబితాలో చేర్చకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మారుమూల ప్రాంతం కావడంతో ఇప్పటికే దూరప్రాంతం నుంచి కవిటి ఎవరూ వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పుండు మీద కారం చల్లినట్లు మెరుగైన రవాణా సదుపాయం ఉన్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు జీతాలు పెంచి వ్యాధి ప్రభావిత ప్రాంతమైన కవిటి మండలాన్ని నిర్లక్ష్యం చేయడంతో ఫలితం ప్రజలు అనుభవించే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో అటు కడప, ఇటు కర్నూలు తదితర ప్రాంతాల నుంచి వచ్చి కవిటిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు ఈ సంఘటనతో మీమాంసలో పడ్డారు. గత కొన్నేళ్లుగా తాము మండలంలో చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు ఇదేనా అంటూ మదన పడుతున్నారు.

అందుబాటులో లేని నెఫ్రాలజిస్టు

మరోవైపు కిడ్నీ వ్యాధితో సతమతమవుతున్న కవిటి మండలం బాధితులకు నెఫ్రాలజిస్టు లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. కవిటి డయాలసిస్ సెంటర్ కూడా నెఫ్రాలజిస్టు నెలకు రెండుసార్లు మాత్రమే సందర్శించి బాధితులకు సలహాలు సూచనలు అందిస్తున్నారు తప్పించి పూర్తిస్థాయి నెఫ్రాలజిస్టు లేకపోవడం కిడ్నీ బాధితులకు శరాఘాతంగా మారుతోంది. ముఖ్యంగా పూర్తిస్థాయిలో నెఫ్రాలజిస్టు లేకపోవడం డయాలసిస్ సెంటర్లు కూడా పూర్తిగా టెక్నీషియన్ల పరిజ్ఞానంతోనే నడుస్తున్నాయి. దీంతో కవిటిలో నెఫ్రాలజిస్టు తప్పనిసరిగా ఉండాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు అధికారులకు స్థానికులు వినతిపత్రాలు అందివ్వడం జరిగింది. అయినా ఇప్పటి వరకు నెఫ్రాలజిస్టు అందుబాటులో లేరు. దీంతో కిడ్నీ బాధితులు శ్రీకాకుళం, విశాఖపట్నంలో ఉంటున్న నెఫ్రాలజిస్టులను సంప్రదించి వైద్యం చేసుకుంటున్నారు. ఇది బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా పెద్ద భారమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చిన ఈ జిఒ కవిటి వైద్యశాఖపై తీవ్రమైన ప్రభావం చూపించే పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ సమస్యలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించి కవిటి ప్రత్యేక జోన్‌గా పరిగణించాలని కోరారు. ఆయన సూచన మేరకు ప్రత్యేక జోన్‌గా పరిగణిస్తే కవిటి సిహెచ్‌సి స్పెషలిస్టు డాక్టర్లతో పాటు అన్ని సివిల్ అసిస్టెంట్ సర్జన్లు అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉంటుంది. లేని పక్షంలో మళ్లీ మండలంలో వైద్యుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

కవిటి సిహెచ్‌సి

అరకొర సిబ్బందితో..

మండలంలో ఇప్పటికే వైద్య సిబ్బంది కొరత వేధిస్తుండగా కవిటి సిహెచ్‌సిలో గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిభ తర్వాత ఇప్పటివరకు గర్భిణులకు పురుడు పోసిన పరిస్థితి కానీ శస్త్రచికిత్స చేసిన సందర్భం గాని లేదు. ఆమె తరువాత ముగ్గురు గైనకాలజిస్టు విధుల్లో చేరినా సేవలు అందించకుండానే వెళ్లిపోయారు. ప్రస్తుతం ఓ గైనకాలజిస్టు ఉన్న లేనట్టే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంగా కవిటి సిహెచ్‌సిలో 8 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారు. మరోవైపు మండలంలోని పిహెచ్‌సిల్లో వైద్య సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.

తప్పనిసరిగా గుర్తించాలి

తప్పని సరిగా కవిటి ప్రత్యేక జోన్‌గా గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇక్కడికి రావడానికి చాలా మంది వైద్యులు వెనుకంజవేస్తున్నారు. ముఖ్యంగా ఒక విధమైన ప్రచారం ఉన్న పరిస్థితుల్లో ఇక్కడ పనిచేస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నా, మెరుగైన సేవలు అందాలన్నా ప్రత్యేక జోన్‌గా పరిగణించి గిరిజన ప్రాంతాల వైద్యుల మాదిరిగానే ఈ ప్రాంత వైద్యులకు జీతాలు అందించాలి. దీనిపై ప్రభుత్వ విప్ సాను కూలంగా స్పందించారు. అసెంబ్లీ కూడా ఈ సమస్య ప్రస్తావించడం హర్షనీయం. స్థానిక పరిస్థితులు గుర్తించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుం టుందని భావిస్తున్నాం.

- డాక్టర్ రాంజీ, సూపరింటెండెంట్, కవిటి సిహెచ్‌సి

వినతిపత్రం అంజేస్తున్న విజయ

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందజేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ డిమాండ్ చేశారు. అన్నదాత పోరులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ రైతులకు ఎరువులు ఇవ్వకుండా అక్రమంగా కూటమి నాయకులు అందుకున్నారని ఆరోపించారు. ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ప్రతినిధి జోగారావు, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపిపి అంబటి నిర్మల ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి- టెక్కలి

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి యువతలో చైతన్యాన్ని నింపిన భగత్‌సింగ్ త్యాగం యువతరానికి ఆదర్శమని ప్రణవి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, అధ్యాపకులు కృష్ణ, వెంకటరావు, సునీల్‌కుమార్, పేడాడ సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఆధ్వర్యాన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జాతీయ సేవా విభాగం పిఒలు లూక్‌పాల్, కందిగొళ్ల, రామారావు పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలాదికారి బి.రూపావతి, బిసి బాలుర వసతిగృహంలో సమతా సైనిక్‌దళ్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావు, పిడిఎస్‌యు. జిల్లా కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

'కర్మయోగి'పై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

గిరిజన గ్రామాలు అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కర్మ యోగి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కార్యదర్శి నిర్మల కోరారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో శనివారం పర్యటించి అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ఈ కార్యక్రమం వినియోగిస్తున్నామని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒ శ్యాం, శిక్షకులు కోదండ విద్యాలత, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

రణస్థలం: మండలంలోని కొండములగాం సచివాలయం పరిధిలోని కొండములగాంలో 8 రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడీ సూపర్‌వైజర్ టి.మంగమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ, చక్కెర, నూనె వినియోగంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌష్టిక ఆహారంపై సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్టాల్‌ను అధికారులు, కూటమి నాయకులు దన్నాన సత్తిబాబు, ఎంపిటిసి ప్రతినిధి రెడ్డి వాసుదేవరావు సందర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: పోషణ మాసంలో భాగంగా మండలంలోని పైడిభీమవరం-3 అంగన్వాడీ కేంద్రం పరిధిలో పైడిభీమవరం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పైడి భీమవరం సెక్టార్ అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ తదితరులు

పొజిషన్ ధ్రువపత్రాలు జారీచేయాలి

మాట్లాడుతున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగర పరిధిలోని 15 కాలనీల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అసెంబ్లీలో కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తరతరాలుగా నివసిస్తూ హౌస్ టాక్స్, వాటర్ టాక్స్, కరెంట్ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా, ఇప్పటివరకు పౌరులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఇంటి మీద రుణం పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. ఈ సర్టిఫికెట్లు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి అదనపు భారం ఉండదని, రెవెన్యూమంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చౌదరి సత్యనారాయణ కాలనీ, నీలమ్మ కాలనీ, బర్మాకాలనీ, బాయమ్మతోట, పెద్దరెల్లివీధి, పిఎన్ కాలనీ, నారాయణతిరుమల ప్రాంతం, దమ్మలవీధి, మంగువారితోట, సీపన్నాయుడుపేట, భైరవానిపేటతో పాటు మరికొన్ని కాలనీలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. అదే విధంగా, సిక్స్‌స్టెప్స్ వెలిడేషన్ విధానాన్ని సవరించాలన్నారు. బ్రహ్మగుండం చెరువు వివాదంపై కూడా ఆయన సభలో గళమెత్తారు. గార మండలం అంపోలులో రైతుభరోసా కేంద్రం నిర్మాణంపై కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ, వాస్తవానికి సర్వే నెంబరు 534/1లో 16 ఎకరాల భూభాగంలో చెరువు అసలే లేదని, స్వాతంత్ర్యానికి ముందే ఆ స్థలంలో ఆర్అండ్‌బి రోడ్డు, పాఠశాల, హెల్త్ సెంటర్, కల్చరల్ వేదిక వంటి ప్రభుత్వ భవనాలు ఉన్నాయని గుర్తుచేశారు. అక్కడ ఇప్పటికే 300 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని ఉంటే ఇప్పుడు కూల్చివేయమనే కోర్టు ఆదేశాల వల్ల ప్రజలు రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలోనే రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేశామని, మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

ఉపకరణాల శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

సమగ్ర శిక్ష ఆర్థిక సౌజన్యంతో భారత కృత్రిమ అవయవాల సంస్థ సహకారంతో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా వైకల్య నిర్ధారణ ఉచిత ఉపకరణాల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ఉన్న రణస్థలం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడం మండలాల వికలాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వికలాంగ పిల్లలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఏ విధమైన ఉపకరణాలు అవసరమో గుర్తించారు. సమగ్ర శిక్ష ఎపిసి ఎస్.శశిభూషణరావు, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ బి.గోవిందరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో గుర్తించిన నిర్ధారించిన విద్యార్థులకు నాణ్యమైన వీల్‌చైర్స్, ట్రై సైకిళ్లు, రోలేటర్ వినికిడి యంత్రం, బ్రెయిలీ కిట్, ఎంఆర్ కిట్ వంటి ఉపకరణాలు అందజేయబడతాయన్నారు. వీటిని ఉపయోగించుకొని సాధారణ విద్యార్థుల వలె విద్య, క్రీడల్లో రాణించవచ్చన్నారు. వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.శ్రీరాములు, మురళీకృష్ణ, కె.పున్నయ్య, ముళ్ల శ్రీనివాసరావు, బి.రమణయ్య, వెలమల ఉమ, సహిత విద్య ఉపాధ్యాయులు బాలరాజు, గొరు మాధురి, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

ఆక్సిజన్ సిలిండర్ అందిస్తున్న రాజేష్

రాజేష్ వితరణ

ప్రజాశక్తి- కవిటి

సామాజిక సేవలో ముందుండే జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ మరోసారి తన దాతృత్వం నిరూపించుకున్నారు. శనివారం తన జన్మదిన సందర్భంగా కవిటి ప్రభుతాస్పత్రిలో కిడ్నీ బాధితుల కోసం ఒక ఆక్సిజన్ సిలిండర్, రోగులకు అవసరమైన బెడ్ (మంచం) అందించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ, జన సైనికులు చీకటి కృష్ణయ్య, బైపల్లి దాలయ్య, కె.ప్రశాంత్, పెద్దింటి రవీంద్ర వర్ధన్, గుజ్జల శంకర్, డొంక ఉమాపతి, వెంకట్, శాంతారావు హరేకృష్ణ, డొక్కరి సోమేష్, రాజు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధితో ప్రగతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చిన్నహరిచంద్రపురంలో నిర్మించిన పంచదామా క్షేత్రానికి పర్యాటక కేంద్రంగా గుర్తింపు లభించిందని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పంచుదామా క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, టిడిపి మహిళా అధ్యక్షులు, హరిచంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పూజారి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని దీర్ఘాశి వద్ద ఉన్న పురాతన శిలా శాసనం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బాపూజీ యువజన సంఘం సభ్యులు కోరారు. మండల ప్రత్యేక అధికారి ఎల్.వి.మధు ఆధ్వర్యాన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, డిటి రాజారెడ్డి, సర్పంచ్ సుమంగళి, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకటప్పలనాయుడు, సొసైటీ చైర్మన్ బైరి భాస్కర రావు, పివిఎస్ఎన్.మూర్తి, మల్లేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని తేలుకుంచిలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ గ్రామంలో సైబీరియన్ కొంగలకు నిలయంగా ఉంది. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రామారావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి సూర్య నారాయణరెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ నవీన్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పర్యాటక రంగం అభివృద్ధికి తీరప్రాంతంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, నియోజకవర్గం అభివృద్ధి ప్రత్యేక అధికారి మధుసూదనరావు అన్నారు. మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించాఉరు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, టిడిపి నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, సప్ప నవీన్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం డైరెక్టర్ రాపాక శాంతమూర్తి, కోనేరు ఆదినారాయణ, నీలకంటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, భావన దుర్యోధనరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: ప్రపంచ పర్యాటక దినోత్సవం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జిల్లాలో ముఖ్యంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 140 పైగా సందర్శించ దగ్గ చిన్న, పెద్ద పర్యాటక కేంద్రాలు ఉన్నాయని అదనపు కన్వీనర్ ఇంటాక్ వావిల పల్లి జగన్నాథ నాయుడు అన్నారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి ,స్టార్ వాకర్స్ శ్రీకాకుళం అధ్యక్షుడు ఇందిరా ప్రసాద్ హాజరయ్యారు.

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

రాజారావు మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని కంబకాయకు చెందిన కెల్లా రాజారావు (34) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజారావు సరుబుజ్జిలి మండలం చిగురువలస స్వగ్రామం. మండలంలోని కంబకాయకు రామలక్ష్మితో వివాహమైంది. అనంతరం అత్తవారింటికి ఇల్లరికం వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజారావు ఇంటి బాధ్యత మరిచి తిరుగుతుండేవాడు. దీంతో భార్యాభర్త మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 22న మృతుడి భార్య మందలించడంతో ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగేసి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన మర్రి చెట్టు

తప్పిన ముప్పు

కూలిన భారీ మర్రి చెట్టు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని ముత్యాలపేట - వడ్డి పుట్టుగ గ్రామాల మధ్యలో శనివారం ఉదయం భారీ మర్రి వృక్షం నేలకూలింది. అదే సమయంలో అటువైపుగా కొబ్బరికాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం తృటిలో ఈ ప్రమాదం నుంచి తప్పించుకుంది అయినా వాహనం వెనుక భాగం కొంత దెబ్బతింది. అదే వాహనంపై చెట్టు పడి ఉంటే అందులో ఉన్న వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, కార్యదర్శి నెమలిపురి మన్మథరావు, విఆర్‌ఒ పార్వతి సంఘటన స్థలానికి చేరుకొని చెట్టు తొలగించే పనులు ప్రారంభించి సమాచారాన్ని తహశీల్దార్‌కు తెలియజేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మురళీ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి పర్యవేక్షించారు. అందరి సమీష్టి కృషితో మధ్యాహ్నంలోగా చెట్టు తొలగించి మార్గం శుభ్రం చేశారు.

దుకాణానికి వేలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఉన్న పోలీసు షాపింగ్ కాంప్లెక్స్‌లోని 10వ దుకాణం వేలం పద్ధతిలో అద్దె ప్రాతిపదికన మంజూరు చేయనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు, వ్యక్తులు దరఖాస్తు చేసుకుని వేలంలో పాల్గొనాలని కోరారు. దరఖాస్తుల కోసం సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదే రోజు వేలం వేయబడునని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయం, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ 6309990841 నంబర్‌ను సంప్రదించాలని, షరతులకు లోబడి లీజు ఉంటుందన్నారు.

వివాదాన్ని పరిష్కరించాలి

టెక్కలి : హిందుపురం ఎమ్మెల్యే, నటులు నందమూరి బాలకృష్ణ, కేంద్ర మాజీ మంత్రి, నటులు చిరంజీవి మధ్య తలెత్తిన అంతర్గత వివాదాన్ని పరిష్కరించేందుకు సినీమా ఫొటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేస్ చొరవ చూపి సమస్యని పరిష్కరించాలని టెక్కలి సుదర్శన థేటర్ యజమాని సత్తారు వెంకట రమణ ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనని ఇప్పుడు అసెంబ్లీలో బాలకృష్ణ ప్రస్తావించడం సబబుకాదన్నారు. వాస్తవాలు ఏమైనా నటుల మధ్య తలెత్తిన వివాదం వల్ల పరిశ్రమకు నష్టం కలిగే పరిణామాలు ఉన్నాయని అన్నారు.

మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన

సోంపేట : ఎవరైనా తరగతులను కించపరిస్తే వారిపై చర్యలు తప్పవని మండల న్యాయ సహాయ సంఘం, ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్‌బాబు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతులను ఉద్దేశించి మనుషులను తేడాగా చూడకూడదని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలను తక్కువ చేస్తూ మాట్లాడకూడదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు, సిఐ బి.మంగరాజు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, న్యాయవాదులు ఎం.సర్వేశ్వరరావు, బి.రుక్మాంగదరావు, వసంతరావు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

సారవకోట : మండలంలో బుడితిలో డాక్టర్ అనుజ్ఞ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యకరమైన మహిళలకు బలమైన ఆహారం, పిల్లలకు పౌష్టికాహారానికి ఆయా గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్మించామన్నారు. లక్ష్మీపురం, బద్రి, గోవర్ధనపురం, బైదలాపురం, ఉప్పరపేట పలు కేంద్రాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ అనుజ్ఞ

సందిగ్ధంలో రోడ్డు నిర్మాణం

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన భవనం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లేందుకు వీలుగా పక్కా రోడ్డు నిర్మాణం సందిగ్ధంలో పడింది. మండల పరిషత్ కార్యాలయానికి చెందిన ప్రస్తుత రోడ్డుని కాదని స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భావించారు. ఇందులో భాగంగా దశాబ్దాల కాలం నుంచి ఉన్న ప్రస్తుత పంచాయతీ పరిపాలనాధికారి కార్యాలయానికి చెందిన భవనాలు కూల్చివేసి వాటిపైనుంచి పరిషత్ కార్యాలయానికి వెళ్లేందుకు వీలుగా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీ ఆధీనంలో ఉన్న ఒక దుకాణం, కార్యాలయం ఆవరణలోని మూడు టేకు చెట్లు, ప్రస్తుత పరిపాలన భవనాలు కూల్చేందుకు పంచాయతీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే పరిషత్ కార్యాలయానికి ప్రస్తుతం రోడ్డు ఉంది. కార్యాలయానికి వెళ్లే క్రమంలో రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, ఇటువంటి క్రమంలో దశాబ్దాల కాలం నుంచి ఉన్న ప్రస్తుత కార్యాలయ భవనాలు కూల్చడంలో ఆర్థం లేదని వార్డు సభ్యులు భావిస్తున్నారు. మంత్రి నిర్ణయం అసంబద్ధంగా ఉందని వార్డు సభ్యులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో భవనాలు కూల్చేందుకు ఆమోదం తెలపలేదు. కార్యాలయ భవనాలు కూల్చి పరిషత్ కార్యాలయానికి రోడ్డు వేయాలని మంత్రి, రోడ్డు వద్దని పంచాయతీ కార్యనిర్వహణ సభ్యుల మధ్య అంతర్గత

రోడ్డు నిర్మిస్తే తొలగించాల్సిన భవనాలు

అభిప్రాయభేదాలు వల్ల రోడ్డు నిర్మాణం సందిగ్ధంలో పడింది. అయితే పరిషత్ కార్యాలయానికి రోడ్డు నిర్మించకపోవచ్చునన్న ముందస్తు ఆలోచనలో భాగంగానే ఇటీవల పంచాయతీ దుకాణాల వేలం పాటలో కూల్చివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ దుకాణానికి వేలం పాట కూడా నిర్వహించలేదని కార్యదర్శి స్పష్టం చేశారు. పరిషత్ కార్యాలయానికి రోడ్డు నిర్మిస్తే కూల్చివేసే భవనాల స్థానంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పంచాయతీ కార్యాలయ భవనాల్లోకి పరిపాలన చేపట్టవచ్చునన్న ఆలోచనలో కూడా యంత్రాంగం ఉంది. ఇటువంటి సందేహ పరిస్థితిలో పరిషత్ కార్యాలయానికి వెళ్లేందుకు నిర్మాణం చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణం పనులు సందిగ్ధంలో పడింది.

యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి- కవిటి

మండల రైతులకు యూరియా అందుబాటులో ఉన్నాయని ఎఒ శ్రీదేవి అన్నారు. స్థానిక పట్టాభిరామయ్య కళావేదికలో శనివారం కూటమి నాయకులతో యూరియా పంపిణీ చేశారు. మొత్తంగా కవిటి, జగతి, భైరిపురం, నెలవంక, బల్లిపుట్టుగ, బెలగాం పంచాయతీలకు సంబంధించి 35 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు రైతులు తగు మోతాదులో యూరియా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, పిఎసిఎస్ సిఇఒ బెందాళం చిరంజీవి, వ్యవసాయ సహాయకులు బొడ్డ మౌనిక, రైతులు బెందాళం రామ్‌ప్రసాద్, బెందాళం ఆనంద్, వజ్జ రంగారావు, ప్రగడ మణిబాబు, బెందాళం చక్రధర్, గార గిరిబాబు, సీగి ధనుంజయ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కడుమలో స్థల వివాదం

కొత్తూరు : మండలంలోని కడుమ కాలనీ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన ఎం.అప్పారావు ఇల్లు నిర్మాణం చేపడుతున్నారు. టిడిపి ఎంపిటిసి గోవిందరావు ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టి ఇంటి నిర్మాణాన్ని అడుకున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అది జిరాయితీ భూమి అని, సదరు వ్యక్తి నిర్మించుకోవచ్చునని స్పష్టం చేశారు. దీనిపై గ్రామస్తులు అంగీకరించలేదు. ఆ స్థలం బహుమతిగా పాఠశాలకు పూర్వీకులు ఇచ్చారని, దానికి సంబంధించిన పత్రాలు అక్టోబరు 5న ఇస్తామని చెప్పారు. అయినా వివాదం ముదరడంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తన సిబ్బందితో వచ్చి ఆందోళనను విరమించారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

మందస: కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి స్లాబ్ రేట్లను తగ్గించడం ద్వారా అధిక ధరలు తగ్గి పేద, మధ్య తరగతులకు నిత్యావసర, గృహావసర వస్తువులు అందుబాటులో ఉంటాయని ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని జిల్లెండ పంచాయతీ స్వయంశక్తి సంఘాల పుస్తక నిర్వహణను పరిశీలించారు. అనంతరం కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు, మధ్య తరగతి ఉపయోగిస్తున్న మోటారు బైకులు, కూలర్, ఇంట్లో వినోదానికి ఉపయోగిస్తున్న టెలివిజన్లు, సెల్ ఫోన్లపై పన్ను తగ్గించిందన్నారు. కిరాణా, ఫ్యాన్లు, మందులు, దుస్తులపైనా పన్నులు తగ్గించారని తెలిపారు. కార్యక్రమంలో విఒఎ కేశమ్మ గ్రామ సంఘం అధ్యక్షులు శ్రీదేవి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు మీనాక్షి, బాలకృష్ణ పాల్గొన్నారు.

మందస : అవగాహన కల్పిస్తున్న ఎపిఎం కూర్మారావు

మెళియాపుట్టి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఎం.రామారావు జిఎస్‌టి తగ్గింపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు, డిటి కె.రాము, ఎఒ ఎస్.దానకర్ణుడు, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రామారావు

కొసమాలలో 'పొలం పిలుస్తోంది'

మెళియాపుట్టి: మండలంలోని కొసమాలలో ఇండి గాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మండేలా రామారావు పాల్గొని రైతులకు సలహాలు, సూచన చేశారు. రైతులకు శాస్త్ర సాంకేతిక పద్ధతి, ఎరువులు యాజమాన్యం, సేంద్రీయ ఎరువులు వాడకం, పురుగు మందులు తెగులు మందులు వినియోగంపైన అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో స్వల్పకాలిక దీర్ఘకాలిక ప్రయోగాలు ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతి ద్వారా ద్రవ జీవామృతాలు తయారీ పొలంలో వాడుకునే విధానం గురించి అవగాహన కల్పించారు. పొలంబడి కార్యక్రమంలో 30 మంది రైతులు 25 ఎకరాలు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకుల క్రాంతి, ఉద్యాన సిఇఒ భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ ఇన్‌ఛార్జి జయలక్ష్మి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

నరసన్నపేట: లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్‌లో బహుమతులు సాధించిన పాగోటి సతీష్‌కు రూ.15 వేలు నగదు ప్రోత్సాహకం శనివారం అందజేశారు. నవంబరు 27 నుంచి 29 వరకు థాయిలాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు సతీష్ హాజరవు తున్నారు. లయన్స్ క్లబ్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ జన్మదినం పురస్కరించుకొని ఆయన గృహం వద్ద సతీష్ తండ్రి వెంకటరమణకు నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు టి.రత్నాజీ, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి కె.రమేష్, జెడ్‌సి రమణ సాహు, రంగనాథ్ పాల్గొన్నారు.

సిఎం స్వనిధిపై అవగాహన

ప్రజాశక్తి పలాస

ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పిఎం స్వనిధి 20 లోకకల్యాణ్ మేళా పథకంపై అవగాహన కల్పించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వెంకటరమణ అన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు పిఎం స్వనిధి పథకం ద్వారా మూడో విడతగా రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేలు రుణాలు

అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ

అందించనున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రుణాలు పొందని అర్హులైన లబ్ధిదారులు మెప్మా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసు కోవాలన్నారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎ.శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పథకంలో వీధి వ్యాపారులు భాగస్వాములు కావాలన్నారు. మెప్మా సిటి మేనేజర్ మోహనరావు మాట్లాడుతూ వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా అధికారి ఎల్.హెచ్. కిషోర్, ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు, యుపిఎ మేనేజర్ ధనుంజయ పాల్గొన్నారు.

గట్లపై కూరగాయల సాగు లాభదాయకం

ఆమదాలవలస : పొలం గట్లపై కూరగాయల సాగు రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ సిడిఎఫ్ చేసేన సురేష్ అన్నారు. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేయడం జరుగు తుందని, వరిపంటలో

గట్లపై పండే కూరగాయలతో రైతు

అదనంగా ఆదాయం వచ్చేలా ఏ గ్రేడ్ మోడల్ విధానాన్ని రైతులు అనుసరిస్తూ పంటల సాగు చేసుకున్నట్లయితే అదనపు ఆదాయం చేకూరుతుందని అన్నారు. కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో ఏ గ్రేడ్ మోడల్ పద్ధతిలో పంటలను సాగు చేయడం జరుగుతున్నదని ఇందులో రైతులు గట్లపై వేసుకున్న కూరగాయల వలన నిత్యం ఆదాయం సమకూరుతుందన్నారు. పొలం గట్లపై పండే కూరగాయలు విక్రయం ద్వారా అదనపు ఆదాయం పొందుతారన్నారు. ఎ-గ్రేడ్ పద్ధతి రైతులకు అన్ని విధాల లాభసాటిగా ఉందని ప్రకృతి వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది ఎ గ్రేడ్ పద్ధతిని రైతులతో ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కోట్లాది మంది ప్రజలకు మేలు చేసి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనే వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఐదేళ్ల సిఎంగా సేవలందించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు, దారుణమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన చట్ట సభను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజా ప్రతినిధికి ఉంటుందని, మాజీ సిఎం జగన్‌పై బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సభను అగౌరవ పరచడమేనని అన్నారు. చిరంజీవిని జగన్ గౌరవించారని చిరంజీవిని చూసి బాలకృష్ణ అసూయపడుతున్నారన్నారు. సభా పద్ధతుల ను ఉల్లంఘించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రథమ చికిత్స పునర్జన్మ

ధ్రువపత్రాలు అందజేస్తున్న జగన్మోహనరావు

శ్రీకాకుళం సిటీ: కొన్ని సమయాల్లో ప్రథమ చికిత్స పునర్జన్మగా మారుతుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ రెడ్‌క్రాస్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 20 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ ప్రారంభించిన చైర్మన్ మాట్లాడుతూ హైబిపి, గుండెపోటు, సిపిఆర్ ప్రక్రియపై అవగాహన అవసరమన్నారు. ఆపద సమయాల్లో గాయాలకు కట్టు కట్టటం, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్స, కరెంట్ షాకు తగిలిన వారికి చికిత్స, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స వంటి మరిన్ని అంశాలపై శిక్షణ అవసరమన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్స నేర్చుకొని, ఆపదలో ఉన్న వారికి సహాయ పడాలన్నారు. రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్స శిక్షకులు గొలివి రమణ, ప్రథమ చికిత్సలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీసభ్యులు బి.చిన్నమ్మయరావు, ఎఒ నర్సింగ రావు, మేనేజర్ గుణాకరరావు, పి.సుజాత పాల్గొన్నారు.